క్లుప్తంగా

పీఎం కిసాన్‌కు ఈ-కేవైసీ తప్పనిసరి

ఉప్పునుంతల: పీఎం కిసాన్ పథకానికి అర్హులైన రైతులు తప్పనిసరిగా బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవడంతో పాటు ఈ-కేవైసీని అప్‌డేట్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ- కేవైసీని అప్‌డేట్ చేసుకున్న రైతులకు పీఎం కిసాన్ పథకం ద్వారా ఏడాదికి రూ.6 వేలు మూడు విడతలుగా బ్యాంక్ ఖాతాలో చేస్తారన్నారు. మండలంలో 10,618 మంది రైతులు పీఎం కిసాన్ పథకానికి అర్హులు కాగా.. వారిలో 1,651 మంది రైతులు ఈ-కేవైసీని అప్‌డేట్ చేసుకోలేదని చెప్పారు. మిగిలిన రైతులు ఈ నెల 30వ తేదీలోపు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దకొత్తపల్లి: వానాకాలం సీజన్ రైతుబంధు కోసం ఈ నెల 16 వరకు భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు అర్హులని పెద్దకార్పాముల ఈఏఓ జానకిరాం తెలిపారు. రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకునే వారు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంకు ఖాతా జిరాక్స్, రైతుబంధు దరఖాస్తును నింపి రైతువేదికలో ఏఈఓలకు అందజేయాలని సూచించారు. శుక్రవారం పెద్దకార్పాములలో రైతుబంధు కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు, రైతులు చిన్నయ్య, బాలస్వామి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ కళాశాల సీట్ల భర్తీకి దరఖాస్తులు

కొల్లాపూర్: పట్టణంలోని మైనార్టీ గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థినులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నిరూప సూచించారు. ఇంటర్ ఫస్టియర్‌లో హెచ్‌ఈసీ, సీఈసీ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు సెల్ నం 7995057922కు ఫోన్ చేయాలని సూచించారు.

పోస్టర్లు విడుదల

కొల్లాపూర్: ఇన్సాఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను శుక్రవారం కొల్లాపూర్‌లో ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 24, 25 తేదీల్లో జహీరాబాద్ పట్టణంలో ఇన్సాఫ్ మహాసభలు కొనసాగుతున్నాయని తెలిపారు. సభలకు ఇన్సాఫ్ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషతో పాటు పలువురు నేతలు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ.యూసుఫ్, రుక్మద్దీన్, రమేష్, తుమ్మల శివుడు, కుఉమయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బల్మూర్ వాసికి డాక్టరేట్


సురేష్‌కుమార్

బల్మూర్: పుడమి విద్యా సంస్థలో అకాడమిక్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బల్మూర్ వాసి సురేష్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని సోషల్ వర్క్ విభాగంలో ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బోధనపై అధ్యయనం, రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పరిధి అనే అంశంపై పరిశోధన చేశారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హనా ఆనంద్‌రాజ్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. పరిశోధనా గ్రంథం పరిశీలించి వైవా పూర్తి చేసి సురేష్‌కుమార్‌కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ ప్రదానం చేశారు. 20 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సులభతరంగా పాఠాలు ఎలా బోధించాలో పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్ రూపొందిస్తున్నారు.

చెంచుగూడెంలో వైద్యశిబిరం



కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని నార్లాపూర్ చెంచుగూడెం, అమరగిరిలో చెంచులకు ఐటీడీఏ మన్ననూర్ వారి సహకారంతో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెంట్లవెల్లి ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. శిబిరంలో గర్భిణులకు ఉచితంగా మందులు, టానిక్‌లు అందజేశారు. చిన్న పిల్లలకు రక్తహీనతకు మందులు ఇచ్చారు. బాలింతలకు చికిత్స చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు చంద్రశేఖర్, సంతోష్, రోహిత్, రాజీవ్, రాంమోహన్ తదితరులు ఉన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

తాడూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌అభిరాం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని గర్భిణులందరూ ప్రతి నెల ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించుకుని, ఇచ్చిన మందులను వాడాలన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహార పదార్థం కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు నిర్వహించుకోవాలన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులు అందజేస్తున్న డీపీఎం రమాదేవి

కందనూలు: మహిళల ఆర్థిక అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన, అభ్యున్నతి కోసం ప్రభుత్వం అందించే రుణ సదుపాయాలను మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని నాగర్‌కర్నూల్ డీఆర్‌డీఏ డీపీఎం అరుణాదేవి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో బిజినపల్లి మండలం వట్టెంకు చెందిన శ్రీరామ మహిళా సంఘం, శ్రీ గణేష్ మహిళా సంఘల మహిళలకు ఒక్కో సంఘానికి జీవనోపాధి కల్పించేందుకు రూ.4.50 లక్షల రుణాల చొప్పున మొత్తం రూ.9 లక్షలు బ్యాంకు చెక్కును మహిళా సంఘాలకు అందజేశారు. ఈ సందర్భంగా అరుణా దేవి మాట్లాడారు. మహిళల అభ్యున్నతి, అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక రకాల సదుపాయాలు కల్పిస్తుందని, ఇందులో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ద్వారా రెండు స్వయం సహాయక సంఘాలకు రూ.9 లక్షలు రుణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, బ్యాంకు లింకేజీ కింద ఇచ్చిన రుణాలను సరైన విధంగా వినియోగించుకోవాలని చెప్పారు. మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన రుణాలు అందించడానికి బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని, ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే, హెచ్‌డీఎఫ్‌సీ రీజినల్ మేనేజర్ ఉపేందర్, బ్యాంక్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, శంకర్, డీపీఎం సుధాకర్, రజిత తదితరులు పాల్గొన్నారు.

మోదీ విజయాలపై ఇంటింటి ప్రచారం


కల్వకుర్తిలో రాఘవేందర్‌గౌడ్ ప్రచారం

కల్వకుర్తి రూరల్: దేశ ప్రధానిగా నరేంద్రమోదీ 9 సంవత్సరాల్లో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 12, 22 వార్డుల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, సీనియర్ నాయకులు దుర్గా ప్రసాద్ మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను పుస్తక రూపంలో ఇంటింటికీ అందిస్తున్నామన్నారు. రాఘవేందర్‌గౌడ్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ రూరల్: నియోజకవర్గంలోని వనపట్లలో కొండా నాగేష్ పాల్గొని పేదల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రచారం చేశారు. స్వామి, వెంకటయ్య, రాంబాబు, భాస్కర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల పరిధిలోని అనంతసాగర్, గట్టురాయిపాకుల, గౌతంపల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 25న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జెడ్పీ గ్రౌండ్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొనే బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. నరేంద్రాచారి, వెంకటేష్, రాజు, సైదులు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

అమ్రాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయం సాధిస్తుందని అచ్చంపేట నియోజకవర్గ నాయకులు శ్రీకాంత్‌భీమా తెలియజేశారు. బీజేపీ ఇంటింటి ప్రచారంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని జంగంరెడ్డిపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాజు, రవి, శ్రీనివాసులు, రాజేందర్‌గౌడ్, శ్రీను, రమేష్‌గౌడ్, సురేష్ ఉన్నారు.

కేసు నమోదు

పెద్దకొత్తపల్లి: కల్వకోల్‌కి చెందిన గుణమోని శేసమ్మ సురేష్‌గౌడ్‌ను గురువారం రాత్రి కారు ఢీకొట్టిన సంఘటనలో హనుమంతు నాయక్, గోపినాయక్, డ్రైవర్ శంకర్‌నాయక్‌లపై కేసు నమోదు చేసినట్లు పెద్దకొత్తపల్లి ఎస్ఐ రాజు తెలియజేశారు.

యువతి అదృశ్యం

వెల్దండ: మండల పరిధిలోని కొట్రకి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న యువతి అదృశ్యం కావడంతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. వివరాల ఇలా ఉన్నాయి. ఊర్కొండ మండలం జాకినాలపల్లికి చెందిన సావిత్రి, వెల్దండ మండలం కొట్రలోని అక్క వద్దకు ఈ నెల 19న వచ్చింది. తిరిగి ఈ నెల 22న సాయంత్రం స్వగ్రామానికి వెళ్తున్నట్లు కొట్ర నుంచి వెళ్లిపోయింది. యువతి ఇంటికి చేరుకోకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికారు. యువతి ఆచూకీ లభించకపోవడంతో తండ్రి వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన రమేష్ మృతి చెందడంతో స్నేహితులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.11 వేల ఆర్థికసాయం అందజేశారు. రమేష్ అనారోగ్యానికి గురై మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు తెలిపారు. బాధిత కుటుంబానికి స్నేహితులు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సురేష్, ఎల్లయ్య, సుమన్, జావిద్, బాబు, కొండల్, రాఘవేందర్, రవి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


వినతి అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

అచ్చంపేట రూరల్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందు డిమాండ్ చేశారు. శుక్రవారం అచ్చంపేట ఎమ్మార్సీలోని సిబ్బంది రఘునాథ్‌రెడ్డికి వినతి అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా నడిపిస్తున్న ప్రైవేటు పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలోనే పుస్తకాలను అమ్ముతూ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్‌కిరణ్, మల్లిఖార్జున్, మధు, హరీష్, శేఖర్ పాల్గొన్నారు.

వెన్నెల, నెలపొడుపు సంస్థల సభ్యులకు సన్మానం

కందనూలు: హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో భారత జాగృతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సాహిత్య సభలో వెన్నెల, నెలపొడుపు సంస్థల సభ్యులు ముచ్చర్ల దినకర్, వనపట్ల సుబ్బయ్యలను ఎమ్మెల్సీ కవిత శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. పలువురిని సన్మానించారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన వెన్నెల సాహిత్య అకాడమి, నెల పొడుపు సాహిత్య సంస్థలు చేస్తున్న సాహిత్య సేవలను గుర్తించి భారత జాగృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పురస్కారం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరిశంకర్, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శ్రీధర్, జితేందర్ బాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం


దీక్షా శిబిరంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: సీఎం కేసీఆర్ అనాథలకు ఇచ్చిన హామీలు 8 ఏళ్లు గడిచినా అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ ఆరోపించారు. శుక్రవారం ఎస్సీ కాంప్లెక్స్ ఆవరణలో అనాథలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అనాథల హామీలకు సంబంధించిన నివేదిక రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్నా.. వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. విద్యా, ఆరోగ్య రంగాల్లో 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, ఏడాదికి రూ.100 కోట్లు అనాథల సంక్షేమానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కన్వీనర్ గూట విజయ్ మాట్లాడుతూ.. మంత్రివర్గ ఉపసంఘం అనాథల మీద ఇచ్చిన నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి, మహేష్, వెంకటేష్, లక్ష్మీ, కృష్ణ, అర్జున్, విజయ్, అంజి, జగదీశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు..

తాడూరు: జేఈఈలో ఉత్తమ ఫలితాలు సాధించిన మధుతో పాటు ఉపాధ్యాయుడు అంజయ్యను పీసీటీఏ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థిని అభినందించడంతో పాటు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. సావిత్రిబాయ్‌పూలే చిత్రపటాన్ని అందించారు. ఉపాధ్యాయుడు వెంకటయ్య, భాస్కర్, మల్లిఖార్జున్, గోపాలాచారి పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలపై అవగాహన


సమావేశంలో పాల్గొన్న అధికారులు, తల్లులు

మన్ననూర్: అప్పుడే పుట్టిన బిడ్డ మొదలుకొని సుమారు ఆరు నెలల వరకు పిల్లలకు తల్లిపాలు తప్పనిసరిగా పట్టినట్లైతే పిల్లల్లో ఎదుగుదలతో పాటూ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ దమయంతి అన్నారు. డబ్ల్యుయూడీసీడీ ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఈసీసీఈ కన్సల్టెంట్ రోజా రమణి మన్ననూర్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో తల్లులు, చిన్నారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఆరోగ్య సంబంధమైన పలు విషయాలను తల్లులతో చర్చించారు. పిల్లల పెంపకం, సంరక్షణకు, మైండ్ ఎదుగుదల, ప్రీ స్కూల్ విషయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డా. మెరీన, డా. కిరణ్, రాజ్‌కుమార్, సువర్ణ, యశోద తదితరులు పాల్గొన్నారు.

మేనేజర్‌కు...

తెలకపల్లి: మండల కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ ఉదయ్ కుమార్ ఇక్కడి నుంచి బదిలీపై ముంబయికి వెళ్తున్నాడు. శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ఆయన్ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రాజ, ఫీల్డ్ ఆఫీసర్ నాగేష్, నిరంజన్, నర్సింహ, వీఓఏలు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ మార్పునకు శ్రీకారం


పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

అచ్చంపేట రూరల్: ప్రభుత్వం విద్యా వ్యవస్థ మార్పునకు శ్రీకారం చుట్టిందని సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ నూరుద్దిన్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ షర్ఫొద్దీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని లింగోటం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో చేపడుతున్న పనులను నాణ్యతగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

కార్యవర్గం ఏర్పాటు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో కొంటిన్యదళ సభ్యులు శుక్రవారం సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు సాయికుమార్‌గౌడ్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, గౌరవ సలహాదారుడు విజయ్‌గౌడ్, మండల అధ్యక్షుడు సాయికుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సురేందర్‌గౌడ్, లింగస్వామిగౌడ్, సత్యంగౌడ్, ప్రధాన కార్యదర్శి చంద్రశేకర్‌గౌడ్ వీరితో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పథకాలు అమలు


తాడూరు శివారులో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ

ఉప్పునుంతల: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలవుతాయని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన తాడూరు శివారులో ఈజీఎస్ పనులు చేస్తున్న కూలీలను కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేదలకు బియ్యంతో పాటు పలు రకాల నిత్యావసర సరకులు రేషన్‌షాపు ద్వారా అందించామన్నారు. ప్రస్తుతం బియ్యం తప్పా మరొకటి లేదన్నారు. బియ్యం కూడా కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని, కేసీఆర్ కేవలం ప్రచారం మాత్రమే చేసుకుంటున్నాడని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కుటుంబంలో ఉన్న వృద్ధులు భార్యభర్తలిద్దరికి నెలకు రూ.3 వేల పింఛన్ డబ్బులు ఇస్తామన్నారు. భూమి లేని కూలీలకు ఏడాదికి రూ.15 వేలు ఉచితంగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

పెంట్లవెల్లి: తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని పెంట్లవెల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింగయాదవ్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రెండుసార్లు నమ్మి ప్రజలు మోసపోయారని, ఇచ్చిన ఏ హామీని నెరవేర్చని ప్రభుత్వం ఒక బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు.

స్థలం ఉన్న ప్రతిఒక్కరికీ రూ.3 లక్షలు ఇవ్వాలి

నాగర్‌కర్నూల్ రూరల్: స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని పరిస్థితి ఉన్న నిరుపేదలందరికీ తెలంగాణ ప్రభుత్వం రూ.3 లక్షలు మంజూరు చేసి ఆదుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత డిమాండ్ చేశారు. శుక్రవారం సందాయిపల్లిలో పేదలు వేసుకున్న గుడిసెలను సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఒకే కుటుంబంలో ఎక్కువ మంది చిన్న ఇళ్లల్లో ఉంటున్నారని, పెళ్లిల్లు అయిన కుటుంబాలు ఎక్కడ ఉండాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల పోరాట వేదిక నాయకులు అశోక్, వెంకటస్వామి, చంద్రయ్య, బాలస్వామి, లక్ష్మమ్మ, శాంత, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ


కొలతలను పరిశీలిస్తున్న అధికారులు

చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లి, జేపల్లి, కమాల్‌పూర్, చారకొండ గ్రామాల్లో శుక్రవారం ఉపాధిహామీ పనులపై రెండోవిడత సామాజిక తనిఖీ చేపట్టారు. గ్రామంలో ఉపాధిహామీలో చేసిన డంపింగ్ యార్డు, శ్మశానవాటిక, నూర్పిడి కల్లాలు, కల్వర్టులు, సీసీరోడ్డు తదితర పనులను నాణ్యత, వాటి కొలతలను తనిఖీ చేసి పరిశీలించారు. పంచాయతీ కార్యాలయాల్లో కూలీల నుంచి వివరాలు సేకరించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. ఈ నెల 25న గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సామాజిక తనిఖీపై గ్రామసభలు, 26న తనిఖీపై మండల సామాజిక సభ ఉంటుందని ఎంపీడీఓ జయసుధ తెలియజేశారు. తనిఖీలో అధికారులు ఎస్ఆర్‌పీ స్వామి, డీఆర్‌పీ నాగయ్య, ఈసీ రవి, టీఏ యాదయ్య, ఎఫ్ఎలు శ్రీను ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అడ్డుకుందాం..


క్విజ్ పోటీల నమోదును ప్రారంభిస్తున్న అనిల్

కల్వకుర్తి రూరల్: నియోజకవర్గంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజుల దోపిడీ చేస్తున్నాయని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాపూర్‌లో రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కల్వకుర్తి పట్టణంలో నర్సరీ చదివే విద్యార్థులకు రూ.20 వేల నుంచి రూ.30 వేలు వసూలు చేయడం దారుణమన్నారు. పేద మధ్య తరగతి కుటుంబాల వద్ద విద్యాదోపిడే లక్ష్యంగా పనిచేయడంతో పాటు స్కూల్ డ్రెస్‌లు, పుస్తకాలతో వ్యాపార కేంద్రాలుగా ప్రైవేట్ పాఠశాలలు మారిపోయాయని ఆరోపించారు.

పాఠశాలల తనిఖీ

ఉప్పునుంతల: మండంలోని లక్ష్మాపూర్, కాంసానిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు పెద్దాపూర్, ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం జిల్లా సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ నూరుద్దీన్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ షర్ఫుద్దీన్ తనిఖీ చేశారు. 'మన ఊరు- మన బడి' పనులను పరిశీలించిన వారు, పెండింగ్‌లోని పనులను వెంటనే పూర్తి చేయించాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు సూచించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, విద్యాబోధనపై తల్లిదండ్రులకు వివరించి, వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేలా మార్పు తీసుకురావాలని సూచించారు.

పల్లెప్రగతి పనుల పరిశీలన


నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయసుధ

చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లిలో శుక్రవారం ఎంపీడీఓ జయసుధ సర్పంచ్ మహేష్‌తో కలిసి పల్లెప్రగతి పనులు పరిశీలించారు. గ్రామంలో నర్సరీల్లో మొక్కల పెంపకం, వాటి నిర్వహణపై అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. వర్షాలు కురుస్తుండటంతో గతంలో నాటిన మొక్కలు అక్కడక్కడా ఎండిన వద్ద ఖాళీ స్థలంలో మొక్కలు నాటాలని సూచించారు. గ్రామాల్లో టార్గెట్ ప్రకారం గుంతలు తీసి మొక్కలు నాటాలని ఆదేశించారు. అదేవిధంగా ఇంకుడు గుంతలు కమ్యూనిటీకి సంబంధించిన 4 యూనిట్స్‌ను గుర్తించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీ ఎదుట ముస్లింల నిరసన


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ముస్లింలు

కొల్లాపూర్: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ముస్లింలు ధర్నా నిర్వహించారు. శుక్రవారం నమాజ్ ముగిశాక మూకుమ్మడిగా మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. పట్టణంలోని తోళ్లగేరి సమీపంలోని పురాతన శ్మశానవాటిక స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తున్నారని వారు ఆరోపించారు. దీనిని అడ్డుకోవాలని అధికారులను కోరితే వారు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా ఆ స్థలాన్ని పరిరక్షించాలని, ఆక్రమణలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ముస్లింలంతా సంఘటితమై ఆందోళనలు చేస్తామన్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో వినతి అందజేశారు. నయూమ్, ఖదీర్, జావేద్, నదీమ్, బీఖాన్

వక్ఫ్‌బోర్డులో వినతిపత్రం..

జామెమజీద్ కమిటీ చైర్మన్ ఖాజాచావుష్‌తో పాటు కమిటీ సభ్యులు శుక్రవారం హైదరాబాద్‌లో వక్ఫ్‌బోర్డు అధికారులను కలిశారు. శ్మశాన వాటిక స్థలాన్ని కొలిచి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు వక్ఫ్‌బోర్డు సీఈఓ ఖాజామైనొద్దీన్‌కు వినతి అందజేశారు. ఖాజాచావుష్ వెంట కమిటీ సభ్యులు పర్వేజ్ తదితరులున్నారు.

రాజీవ్ గాంధీ క్విజ్ కాంపిటీషన్

కందనూలు: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రాజీవ్ గాంధీ క్విజ్ కాంపిటీషన్‌పై గురువారం జిల్లా కేంద్రంలోని పలు కళాశాలలను సందర్శించి వివరించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నాగం శశిధర్ రెడ్డి మాట్లాడారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువ శక్తిని మేలుకొల్పే దిశగా కాంపిటీషన్లలో ప్రతిఒక్క విద్యార్థి పాల్గొని బహుమతులు పొందాలని కోరారు. 7661899899 నంబర్‌పై మిస్డ్ కల్ ఇచ్చి రిఫరల్ కోడ్ నాగం అని టైప్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

టోర్నీ విజేత అమ్రాబాద్



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహించిన డివిజన్ స్థాయి పంచాయతీరాజ్ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ శుక్రవారంతో ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో అచ్చంపేట జట్టుపై అమ్రాబాద్ జట్టు గెలిచింది. విన్నర్, రన్నర్ జట్లకు బహుమతులను డివిజన్ పంచాయతీ అధికారి వెంకటయ్య అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు మధుసూదన్‌గౌడ్, రాంమోహన్, ఎంపీఓలు వెంకటేశ్వర్లు, నారాయణ, చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కూలి రూ.600 ఇవ్వాలి

పెంట్లవెల్లి: మండలంలో ఉపాధి కూలీలకు రోజు కూలి కనీసం రూ.600 చెల్లించాలని శుక్రవారం సీఐటీయూ జిల్లా నాయకులు ఈశ్వర్ డిమాండ్ చేశారు. పని చేస్తున్న ప్రదేశంలో టెంట్ సౌకర్యం, ప్రథమ చికిత్స, పరికరాలు కల్పించాలన్నారు. అందులో భాగంగా పెంట్లవెల్లిలో పనిచేస్తున్న ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

నోట్‌బుక్స్ వితరణ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని వనవాసీ సేవా ప్రకల్ప బాలుర హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం అచ్చంపేటకు చెందిన మనోహర్‌రెడ్డి, అరుణ కుమారుడు ప్రదీప్‌రెడ్డి నోట్‌బుక్స్, పెన్నులు వితరణ చేశారు.